క్లుప్తంగా

జింక్, ఓఆర్ఎస్‌పై అవగాహన



ఓఆర్ఎస్, జింక్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

పోలాకి: శరీరానికి జింక్, ఓఆర్ఎస్ ఎంతో అవసరమని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పోలాకి ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ అన్నారు. పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దీనికి సంబంధించి సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. అతిసార వ్యాధి ప్రబలినప్పుడు ఓఆర్ఎస్ వాడే విధానం, జింక్ మాత్రల అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. శరీర నిర్జలీకరణాన్ని సకాలంలో జింక్, ఓఆర్ఎస్‌ల వాడకం ద్వారా దూరం చేయవచ్చన్నారు. పర్యవేక్షణ సిబ్బంది శేఖరబాబు, లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



రామస్వామిని సన్మానిస్తున్న సర్పంచ్ గౌరీపతి, గ్రామ పెద్దలు

ఆమదాలవలస: ప్రభుత్వ ఉద్యోగి తన విధులను సక్రమంగా నిర్వహిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని అక్కులపేట సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతి అన్నారు. మండలంలోని అక్కులపేట పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మన్ మీసాల రామస్వామికి ఉత్తమ లైన్‌మన్‌గా ఇటీవల ఢిల్లీలో అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామ పెద్దలంతా కలిసి సోమవారం సన్మానం చేశారు. విద్యుత్‌శాఖలో లైన్‌మన్ పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. రూరల్ లైన్‌ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, లైన్‌మన్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ అశోక్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పురోహితులు

నరసన్నపేట: బ్రాహ్మణులు, పండితులు, పురోహితులపై ఉద్దేశపూర్వకంగా అసభ్య పదజాలంతో దూషించిన మన్యం జిల్లా శాలిని గ్రామానికి చెందిన పైల దాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నరసన్నపేట మండలం సత్యవరగ్రహారం గ్రామానికి చెందిన పురోహితులు, వేద పండితులు కోరారు. ఈ మేరకు మారుతీ బ్రాహ్మణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మావుడూరు జగదీష్ బాబు, జోష్యుల సోమేష్ శర్మ మాట్లాడుతూ పైల దాస్ వ్యాఖ్యలు తమను తీవ్ర వేదన కలిగిస్తున్నాయన్నారు. పురోహితులు, వేద పండితులను ఈ విధంగా దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. పవన్ శర్మ, ప్రసాద్ శర్మ, వేణుగోపాల శర్మ, సత్యానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇదే పాఠశాలలో 1984లో చదువుకున్న విద్యార్థులు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, గొడుగులు, ఇతర విద్యా సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ.. విద్యలో చక్కటి ఫలితాలు సాధిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. హెచ్ఎం రమణమూర్తి, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు దుర్యోధన, సుందరరావు, ఖగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అమ్మకాల ప్రారంభం



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు: మండలంలోని అంగూరు గ్రామం వద్ద ఇసుక అమ్మకాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం ప్రారంభించారు. పేదలకు న్యాయం జరగాలన్న ఆలోచనతో ఎన్‌డీఏ కూటమి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇసుక లోడింగ్, రవాణాలో ఎటువంటి అక్రమాలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మైన్స్ ఏడీ సత్యనారాయణ, తహసీల్దార్ ప్రసాదరావు, సీఐ వేణుగోపాలరావు, ఎస్ఐలు శ్రావణి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పోలాకి: గాతలవలసలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిను మరువం రాజన్నా అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిస్తూ సుపరిపాలన అందించిన మహానేత.. జలయజ్ఞం పేరిట సాగునీటి ప్రాజెక్టులు అందించిన రైతు బాంధవుడు.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దరిచేర్చిన విద్యాప్రదాత.. ఆరోగ్యశ్రీతో పేదలకు పునర్జన్మ ప్రసాదించిన ప్రాణదాత వైఎస్సార్ అని కొనియాడారు. పలుచోట్ల పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: హైదరాబాద్‌లోని రామకృష్ణాపురంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జగదీష్ గుప్తా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల వైఎస్సార్‌సీపీ అభిమానులు



నరసన్నపేట: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



జలుమూరు: గంగాధరపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య



సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కొత్తూరు: కొత్తూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పొందూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బూర్జ: మదనాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సారవకోట: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు



ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కేక్ కట్ చేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తెలుగు ప్రజల మదిలో చెరగని సంతకం

ఆమదాలవలస: తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్న మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పటికీ మరువలేని గొప్పవ్యక్తి వైఎస్సార్ అని అన్నారు. ప్రజలకు అను నిత్యం సేవచేస్తూ వారి అభిమానాన్ని పొందాలన్న తపనతో డాక్టర్ వృత్తి నుంచి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి ఎన్నో కష్టాల్ని, ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. వైఎస్సార్ పాదయాత్ర ప్రజల హృదయాలకు దగ్గర చేసిందన్నారు. 2004 నుంచి 2009 వరకు రాష్ట్రాన్ని స్వర్ణయుగంగా తీర్చిదిద్దారన్నారు.

కుట్రలు ఆపి హామీలు నెరవేర్చండి..

మంచి చేస్తారని ప్రజలు అధికారం ఇస్తే ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం సమంజసం కాదని తమ్మినేని సీతారాం అన్నారు. కుట్రలు ఆపి ప్రజలకు ఇచ్చే హామీలు నెరవేర్చాలన్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా దాడులు చెయ్యడం చూడలేదన్నారు. ప్రజలకు మీరు ఇచ్చిన హామీలపై శ్రద్ధ చూపాలని దాడులపై కాదన్నారు. ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో అడుగులు వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, పార్టీ ప్రచార విభాగ జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్, పార్టీ ముఖ్య నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, బొడ్డేపల్లి నారాయణరావు, కోట గోవిందరావు, కోట వెంకటరామారావు, ఖండాపు గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి, ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

అధికార పార్టీ దాడులను సమష్టిగా ఎదుర్కొందాం



పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చేపడుతున్న దాడులు, ఆస్తి నష్టాలను సమష్టిగా ఎదుర్కొందామని మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్సార్ జయంతిని నరసన్నపేటలో ఘనంగా నిర్వహించారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం, వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. స్థానిక సంస్థల్లో బలంగా ఉన్నామన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీని గ్రామాల్లో బలోపేతం చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, సురంగి నర్సింగరావు, సదాశివుని కృష్ణ, రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, పి.సాయి ప్రసాద్, యాబాజి రమేష్, యాళ్ల అప్పలనాయుడు, కనపల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

పాతపట్నం: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మదిలో చెరగని ముద్రవేసుకున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ అమలు చేసిన పథకాలు పేదలకు అండగా నిలిచాయన్నారు. ఎంపీపీ దొర సావిత్రమ్మతో కలిసి కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, ప్రత్యేక సలహాదారుడు ఎం.గణపతి, ఎంపీటీసీలు దువ్వారి జోగారావు, పోలాకి రేణుక, చందనకొల సరస్వతి, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆక్రమణలను అడ్డుకోవాలి

ఆమదాలవలస: ప్రభుత్వ భవనాలు నాశనం చేసి ఆక్రమిందుకు యత్నిస్తున్న టీడీపీ నాయకుల జోరును అధికారులు అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శితమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలోని గాజుల కొల్లివలస గ్రామంలో పాఠశాల ఆవరణలో గల వంటశాల భవనాన్ని రాత్రికి రాత్రే టీడీపీ కార్యకర్తలు జేసీబీతో పడగొట్టి, ఆక్రమణకు యత్నించిన స్థలాన్ని సోమవారం పరిశీలించారు. అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. పార్టీ నాయకులు, సర్పంచ్ మొండేటి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న చిరంజీవినాగ్

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

పొందూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బీ.జ్యోత్స్న పోలీసులను ఆదేశించారు. పొందూరు కోర్టులో సోమవారం పోలీసులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ ప్రమాదాలను నివారించడంలో హెల్మెట్ ప్రాధాన్యతను ద్విచక్రవాహనదారులకు తెలియజేయాలని సూచించారు. పొందూరు, జి.సిగడాం మండలాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన వన పంటలపై ప్రత్యేక శ్రద్ధ

సారవకోట: సారవకోట మండలంలో ఉద్యానవన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏపీఓ నారాయణరావు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 25 సెంట్లుకు పైబడి రైతులు ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సహిస్తున్నట్లు సోమవారం తెలిపారు. మండలంలో 120 ఎకరాల్లో ఉద్యానవన పంటలైన మామిడి, జీడి, కొబ్బరి, సపోట, మునగ తదితర పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ధర్మలక్ష్మీపురం, మాళువ, కూర్మనాథపురం గ్రామాల్లో జీడిమామిడి, కిడిమి, జమచక్రం గ్రామాల్లో మామిడి, సత్రాంలో మునగ, అన్నుపురం, గోవర్ధనపురం గ్రామాల్లో సపోట మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధి పథకం ద్వారా మొక్కలు ఇవ్వడంతోపాటు మూడు సంవత్సరాలపాటు సంరక్షణ బాధ్యతలు తీసుకుంటామన్నారు.

నేడు మండల సమావేశం

నరసన్నపేట: ఈ నెల 9వ తేదీన నరసన్నపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

ఉపాధి పనులు మంజూరు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేసేందుకు సోమవారం అవకాశం కల్పించారు. గత కొన్నేళ్లుగా ఉపాధి పనులు లేకపోవడంతో ఇబ్బంది పడ్డామని వేతనదారులన్నారు. అధికారులకు అర్జీలు పెట్టుకోవడంతో నూకమ్మ చెరువులో పనులు కల్పించారన్నారు. పనులను మాజీ ఎంపీటీసీ సభ్యుడు సీపాన శ్రీరంగనాయకులు ప్రారంభించారు.

పరామర్శ..

కొత్తూరు: కొత్తూరు గ్రామానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ పాగిరి అర్జున్ అత్త నెయిగాపుల అమ్మన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అర్జున్ కుటుంబాన్ని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, లోతుగెడ్డ తిరుపతిరావు, అగతమూడి నాగేశ్వరరావు, పిన్నింటి రామారావు నాయుడు, యడ్ల గోవిందరావు ఉన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసి రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తనవంతుగా కృషి చేస్తానని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం సాయంత్రం ఇంజినీరింగ్ అధికారులు, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఏఓలతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి స్థితిగతులు, అవసరాలు, నిధుల గురించి జిల్లా కలెక్టర్, వైద్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఆస్పత్రి అదనపు భవనాలు, ప్రసూతి వార్డు పనులు తొందరగా పూర్తి చేయాలని ఈఈ సత్య ప్రభాకర్‌కు సూచించారు. డీఈ శిమ్మన్న, ఏఈ వెంకటేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణమూర్తి పాల్గొన్నారు.



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఈఈ, తదితరులు